

# ఆమె - నేను

జి. ఆర్. జోగారావు

'మహారాజశ్రీ టి.——గారి సముఖమునకు, రవాణా.........'అని యిత్యాది గౌరవ పదాలతో పూర్వ ఫక్కీని వ్రాసిన చిరునామాతో జాబు పడుంది మేజా మీద. అయిదు నిముసాలకి యిక paper యిస్తారనగా examination హాల్లో కూర్చున్న candidate కి సహజంగా వుండే ఆతృతతో దాన్ని విప్పేను. నా ఆతృతకి మీరు హేళన చేస్తారనుకుంటా. నే ననుకున్నట్టుగా ఆ జాబు నా కమల దగ్గరనుంచే. అదీ నా anxiety కి కారణం. 'మీ రాక అత్యవుసరము—జాలమువలదు—ధనము వ్యయమగునని టెలిగ్రాము యివ్వలేదు—ఎదురు చూచు చుందును—కమల.' అల్లా Telegraphic Language లో పదకొండు మాటల్లో విషయమంతా తేల్చి, కవరు వుత్తరం వ్రాసిన, కమల అవుసరం యేవిటో బోధపడకపోవటం నా ఆతృతకి రెండో కారణం. కమల నా ప్రాణముతో సమానము. అట్టి ఆనందమయితో సహవాసం లేకపోతే యీ ప్రపంచమంతా అంధకారమయమని నొక్కి చెప్పగలను. 'అసలు ఆవి నిర్మల ప్రేమమూర్తి కొఱకే నే జీవించడం' అని వో ముక్కలో చెప్పేస్తే విషయం తేలిపోతుంది. నా తల్లిదండ్రులు వద్దని యెంత నిర్బంధించినా, కమలని వివాహము చేసుకోవటమే నా నిశ్చయము. ఇంతకీ ఆమె నా ఉబలాటానికీ, ఉత్సాహానికి, ఉన్మత్తకీ నన్ను ప్రోత్సాహించింది కాబట్టే నాకింత గర్వం. అందుకని నేనామెకు కుసుమాంజలి యిచ్చినది యెన్నోసారో లెక్కలేదు............

బి. ఎ. డిగ్రీ పరిక్షలు యెల్లుండి మొదలవుతాయి. పరిక్షకు కట్టింది నేనుకూడ. పదిహేను రోజులాయి పుస్తకం చేత పట్టనేలేదు. వారం రోజుల క్రిందట మా అన్న పెండ్లికి మా వూరువెళ్లి వచ్చింది మొన్ననే. వెళ్లింది పెళ్లి పేరు పెట్టుగొని, కాని కాలం గడపడం కమల సమక్షంలోనే. కమల మా మేడ కెదురుగా ఉన్న యింట్లో ఉనికి. ఆమె మందహాసం, మధురోక్తులు నా brain లో యిప్పుడొక revolution ని work out చేసాయి. 'రెండు రోజుల్లో పరిక్ష—జాగ్రత్త' అని వో protestant·party లేచింది. కాని ఆ స్వర్గకుసుమం యెడ నాకుగల ప్రేమ—ఆమె అత్యవుసరం తీరుద్దామనే కార్యదీక్ష—'ప్రేమ విషయంలో నీవంటి స్వార్థత్యాగి మరొకడు లేడు' అని ఆమెచే అనిపించాలనే నిశ్చయం—యీ party ని Barricade చేసి చితక మొత్తేయి. పరిక్ష పోతే పోయింది వెళ్లడమే ముఖ్యమని తేలింది. Meals తీసుకొని train catch చెయ్యడానికి వేళ లేదు. Restaurant లో Strong గా వో cup కాఫీ తీసుకొని బయలుదేరాను.



రాత్రి పదిన్నరకి మావూరు చేరింది train స్టేషనులో దిగి యేకాయెకీని యింటి కొచ్చేసరికి—నా చక్కని క్రాపు (యెంతో బాగుంటుందని యెన్నో సార్లు remark చేసింది లెండి) నా కళ్లజోడు, Arabian Sandals నన్ను ఆహ్వానించడానికి కొమాసు వీధి గుమ్మంలోనే నించుంది కమల. సరాసరి ఆ అమ్మాయికి యెదురుగా నించున్నా.

'అంత అత్యవసరమైన కార్యంయేవిటి?'

నా ప్రశ్నకు జవాబులేదు.

'నాకోర్కె చెల్లించారే. చాలా ఆయాసపడ్డారు పడుక్కోండి. ఉదయాన్నే మొగం కడుక్కొని రండి' అని ఆమె రివ్వున లోనికి పరుగెత్తింది. అప్పట్లో నా హృదయంలో యెల్లాంటి వూహాలు రేకెత్తేయో మీకేం తెల్సు.

ఎనిమిదిన్నర అయితేనేగాని సూర్యుని చూడననిపట్టిన నాశపథం వమ్మైపోయింది యీ నాటికి. అయిదున్నరకే నా కల్యకృత్యములు తీర్చుకొని కమల సందర్శనమునకు పోయాను. కమలకి తండ్రిలేదు. తల్లికి నేనంటే యెంతో అభిమానం. ఆమె మా యిద్దఱి ప్రేమకీ అడ్డు తగలదంటే తేలిపోతుంది ఆ విషయం........అప్పుడే విడ్డ గులాబిపువ్వు తల్లో యిమిడ్చి, మల్లె తుప్పదరి పాలుమరగిస్తూన్న కమలకి రెండు గజాల దూరంలో మాలతీ పందిర క్రిందగచ్చు అరుగుమీద కూర్చున్నాను. కమలకి పమనాలు గేండ్లుంటాయి. ముక్కుని దక్షిణాది fashion లో 'బేసరు'—మెడలో బంగారు గొలుసు—ఆమె వంటిపై చెప్పుకో తగ్గ నగలు.

కమల నాకేసి విలాసంగా చూస్తూంది అదే పనిగా.

'దృష్టి పెట్టకు.'

'నేను చూస్తే భయంలా. మరివొకరు చూస్తే వొప్పుకోను.'

ఆమెకు నాపై యింత స్వాతంత్ర్యము యెవరిచ్చారు!!

'ఏమిటి అత్యవసరం?'

'ఉండండి! అంత తొందర అయితే యెల్లా?'

అరగంట కూర్చున్నాను ఆమె ప్రణయచేష్టలు పరికిస్తూ. వో గాజుప్లేట్లో 'ఉప్మా' తీసుకొచ్చి యిచ్చింది. మహారాజు కొడుకులా తినిసేను. రజత పాత్రలో కాఫీ పెట్టింది. 'కమల ఆరోగ్యము కొఱకు—' అని త్రాగేసేను.

'ఇప్పుడు చెప్పు.'

'మిమ్మల్ని యిలా ఆహ్వానించి కాఫీ యివ్వాలని మొన్న రాత్రి వూహకలిగింది. అనుకున్న పని వెంటనే జరగాలని మీరే వోసారి నాకు చెప్పిన జ్ఞాపకం. 'మె

యిలు' కండేటట్టు వుత్తరరీ వ్రాసే. అంతకంటె అత్యావుసరమేవిఁటి? అంది కమల.

ఇంటికిపోయాను. 'రేపు పరిక్ష పెట్టుకొని యెందుకు వచ్చావురా?' అని మా నాన్నగారు చివాట్లు వేసేరు. ఏమనుకుంటే యేం లాభం? మారు మాట్లాడలేను. మరి కమల దగ్గరకు వెళ్లలేను. సాయంత్రం train కి బయలుదేరి పదిగంటలకి నాలాడ్జిచేరాను. మరునాడు యిఙ్గ్లీషు papers. Non-detailed essays తీసేను. తలనొప్పి వచ్చింది. 'అమృతాంజనం' యింతరుద్ది నిద్రతీసేను. మరునాడు రెండు papers తగలెట్టానంటే మీకు ఆశ్చర్యం వెయ్యదు. రాత్రి వేగంగా meals తీసుకొని లాడ్జికి వచ్చాను. డ్రామా annotations తిరగ వేస్తున్నా. ఏమీ బోధపడలేదు—తోచలేదు. ఎప్పుడో చదివిన 'It is woman that seduces all mankind—' అన్నవాక్యం మాత్రం అంధకారంలో మెఱుపులా మెరసింది.


# ఇటు చూడండి

ఇతరులను సంప్రతించి మీ కాలమునూ ధనమునూ, శక్తినీ ఎందుకు వృధా పుచ్చెదరు!

## మా అద్భుత దుర్భిణిని

దగ్గిర ఉంచుకొన్నట్లయితే మీరే ప్రయోజకులు కాగలరు.

ఈ దుర్భిణి అధ్యాత్మిక శక్తులకు ప్రఖ్యాతిపొందిన కైలాస పర్వతములలో మూలికవల్ల తయారు అయినది. దీని ప్రయోజనములు తెలిసినట్లయితే ఎటువంటివారైనా చకితులయి పోగలరు.

స్త్రీలు పురుషులు ఎవరయినా సరే. ఎంత వయస్సువారైనా సరే. ఈ దుర్భిణీ సహాయముతో భూత భవిష్య ద్వర్తమానములను ఏ విధమయిన గణితమూ లేకుండా తెలుసుకోగలరు. మృతులయిన బంధువులను మిత్రులను చూడవచ్చును. ఎంతదూరాన ఉన్న ప్రియులనయినను దర్శించవచ్చును. నష్టధన మెక్కడనున్నదో తెలుసుకోవచ్చును. ఇతరుల మనోగతాభిప్రాయలను గ్రహించవచ్చును. సంసారిక వ్యవహారిక విషయములలో మార్గదర్శిగా ఉంటుంది. లాటరీలో ఏ టికెట్టు లాభము తీసికొనివచ్చేది. వ్యవహారములలో జయాపజయములు. పరిక్షలలో ఫలితములు—చిక్కు సమస్యలు—పోటీలు సమస్త విషయములలో సులభముగా మార్గము తెలుస్తుంది. ఆరోగ్యముతో అదృష్టవంతులుగా జీవయాత్ర నడిపె పద్ధతులనన్నింటిని తెలియజేస్తుంది. కష్టకాలములో యింతకన్న ఆప్త మిత్రుడు మరొకడుండడు.

అందరి అందుబాటులో ఉండడానికి దీని ఖరీదు స్వల్పముగా ఉంచడమయినది. గ్యారంటి పత్రముతో సహా పోస్టేజి ప్యాకింగు ఖర్చులు కాకుండా రు. 3-0-0 మాత్రము. పోస్టేజి ప్యాకింగ్ ప్రత్యేకం రు. 0-8-0. ఉత్తర ప్రత్యుత్తరములు యింగ్లీషులో జరపవలెను.

మేనేజరు: స్పిరిచుయల్ బీరో,
భాగుల్ రోడ్డు, దేవలాలి.



మీకు కావలసిన చక్కని యుడుపులు, గుడ్డలు, పలువిధములైన స్వదేశీ సిల్కు చీరెలు, జాకెట్టు రకములును

కేశవరామ్ అండ్ కంపెనీ,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసున దొరకును. మంచి సరకులు! ఱల సరసము!